క్లుప్తంగా

తాళ్లపూడిలో పోలీసు బందోబస్తు



తాళ్లపూడిలో బందోబస్తు నిర్వహిస్తున్న అదనపు సిబ్బంది

తాళ్లపూడి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాలను ఈ నెల 14న మండలంలో ఎటువంటి అల్లర్లు, గొడవలకు తావివ్వకుండా శాంతియుతంగా జరుపుకోవాలని తాళ్లపూడి ఎస్సై తోట రామకృష్ణ కోరారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక పోలీస్ సిబ్బంది మండలానికి వచ్చినట్లు ఎస్సై శనివారం తెలిపారు. ఈ మేరకు ఒక సీఐ, ఎస్సై, ఏఎస్సై, ఐదుగురు సిబ్బంది మండలంలో పర్యటిస్తున్నారు. అంబేడ్కర్ జయంతిని వివాద రహితంగా జరుపుకోవాలని ఎస్సై యువతకు సూచించారు.

భారీ అన్నసమారాధన



కోదండ రామాలయం వద్ద అన్నసమారాధన

దేవరపల్లి: శ్రీరామనవమి వేడుకల ముగింపు సందర్భంగా దేవరపల్లిలోని మెరక వీధి కోదండ రామాలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగిన సమారాధనలో గ్రామస్తులతో పాటు చుట్టుపక్క గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వేలాది మంది భక్తులు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

పట్టణాభివృద్ధికి కృషి చేయాలి

నిడదవోలు : పట్టణాభివృద్ధికి మున్సిపల్ పాలకవర్గం కృషి చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాసం నోటీసును కలెక్టర్ ప్రశాంతి తిరస్కరించడంతో పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో శనివారం అభినందన సభ నిర్వహించారు. దీనికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లకు పార్టీ కండువాలు కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మీ, జనసేన నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుకు ప్రాధాన్యమివ్వండి

నల్లజర్ల: నవధాన్యాలు వేయండి–భూసారాన్ని పెంచండి, నవధాన్యాల సాగు–నేలతల్లికి బాగు అంటూ ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది శనివారం ముసుళ్ళగుంటలో ర్యాలీ నిర్వహించారు. మాస్టార్ ట్రైనర్ సోమిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఖరీఫ్ పంట వేసే 45 రోజుల ముందు దుక్కులు దున్ని నవధాన్యాలు సాగు చేపట్టడం ద్వారా భూమి సారవంతమవుతుందన్నారు. ప్రధాన పంటకు కావాల్సిన నత్రజని, భాస్వరం, పొటాష్, అన్ని రకాల పోషకాలను భూమి వృద్ధి చేసుకుంటుందన్నారు. పంట నీటి ఎద్దడిని తట్టుకుంటుందన్నారు. తెగుళ్ల బెడద, కలుపు నివారణ అరికట్టడం ద్వారా పెట్టుబడి, ఖర్చులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నందమూరి శారదాదేవి, ఉద్యాన అధికారి రూప, యూనిట్ ఇన్‌చార్జి ఎ.కోటేశ్వరీ, రైతులు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నాగలక్ష్మి, రామలక్ష్మి, వీరాస్వామి, నరసింహరావు, మానస, సావిత్రి పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలకు ఆర్వో ప్లాంట్ వితరణ

రాజమహేంద్రవరం సిటీ: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ మల్లా వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ప్రముఖ డాక్టర్ ఆర్ఎస్ చలం దంపతులు వారి తల్లిదండ్రులు రెడ్డి రామస్వామిల జ్ఞాపకార్థం ఈ ప్లాంట్‌ను బహూకరించారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, రోటరీ రివర్ సిటీ అధ్యక్షుడు నాళం నరసింహరావు, కార్యదర్శి కె.చంద్రశేఖర్, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎస్‌జీ శ్యాంసింగ్, పీవీవీఎస్ దొరబాబు, నులి శివ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

రంగంపేట: మర్రిపూడిలో ఎంఎస్ఎస్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ టోర్నమెంట్ మొదలైంది. సుమారు 32 జట్లు పాల్గొంటున్న ఈ పోటీలను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎత్తిపోతల సమాఖ్య అధ్యక్షుడు పుట్టా సోమన్న చౌదరి ప్రారంభించారు. ఈ నెల 28వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని, ప్రథమ బహుమతిగా రూ.30 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు అందిస్తామని నిర్వాహకులు బొలిశెట్టి తమ్మారావు, వడిశల శ్రీను, దూడిపూడి నాని తెలిపారు. మర్రిపూడి యువ క్రికెట్ క్రీడాకారులు మణికంఠ, సత్యానందం, సూరిబాబు జ్ఞాపకార్థం ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

ఇంటర్ ఫలితాల్లో బాలికల హవా

గురుకుల బాలికల కళాశాల విద్యార్థుల ప్రతిభ



వి.తేజస్విని (954, బైపీసీ)



కె.మాధురీ సంజన (956,ఎంపీసీ)



కొడమంచిలి ప్రియాంక (952, బైపీసీ)



యు గీతికా శృతి (425,ఎంపీసీ)



వి.పుష్పలక్ష్మి కుమారి (931)



ఎం.లక్ష్మి మౌనిక (907)



ఎంబీడీ శిరీష (946, ఎంపీసీ)



గున్నేపల్లి తన్విక (815, సీఈసీ)

కొవ్వూరు: ఇంటర్మీడియట్ ఫలితాల్లో కుమారదేవంలోని బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచారు. ఇంటర్ మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 97.2 మంది ఉత్తీర్ణత సాధించగా ప్రథమ సంవత్సరలో నూరుశాతం ఫలితాలను సాధించారు. సీనియర్ ఎంపీసీలో 37 మందికి 37 మంది ఉత్తీర్ణులయ్యారు. బైపీసీలో 37 మందికి 35 మంది ఉత్తీర్ణత సాధించారు.జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీ 36, బైపీసీలో 38 మంది నూరుశాతం ఉత్తీర్ణులయ్యారు. సీనియర్ ఇంటర్‌లో 25 మందికి 900 పైబడి మార్కులు సాధించగా జూనియర్ ఇంటర్‌లో 36 మందికి 400 పైగా మార్కులు సాధించారు. సీనియర్ ఎంపీసీలో బుట్టాయిగూడెం మండలం కోయ రాజమండ్రికి చెందిన కె.మాధురీ సంజన 956, తాళ్లపూడి మండలం రాగోలుపల్లికి చెందిన పెనుకుమర్తి తేజ 951 మార్కులు సాధించారు. సీనియర్ బైపీసీలో గోపాలపురంలోని పెద్దగూడెంకు చెందిన వారా తేజస్విని 954, దేవరపల్లి మండలం యాదవోలు దేశెట్టి వెంకటసరస్వతి 952 సాధించినట్లు ప్రిన్సిపల్ కె.సుజాత తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో...

ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) 63 మంది పరీక్షకి హాజరైతే 46 మంది ఉత్తీర్ణుల య్యారు. వీరిలో బైపీసీలో కుంజా కీర్తన 935 మార్కులతో ప్రథమ స్థానం నిలిచింది. మొదటి సంవత్సరంలో 86 మందికి 54 మంది పాసయ్యారు. ఎంపీసీలో తెడ్డు చందు 438 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచాడు. వృత్తి విద్యా కోర్సుల్లో మొదటి సంవత్సరంలో 21 మందికి 16 మంది, ద్వితీయ సంవత్సరంలో 13 మంది (నూరు శాతం) ఉత్తీర్ణత సాధించారు.

నిరాశాజనకంగా బాలుర కళాశాల ఫలితాలు

ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాలు నిరాశాజనకంగా ఉన్నాయి. మొదటి ఏడాదిలో 95 మంది పరీక్ష రాయగా వీరిలో 46 మంది పాసయ్యారు.వృత్తి విద్యా కోర్సులో 78 మందికి 51 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 94 మందికి 58 మంది, వృత్తి విద్యా కోర్సులో 69కి 66 మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 56.06 శాతం, ద్వితీయ సంవత్సరంలో 76 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు.

ఉండ్రాజవరం బాలికల కళాశాలలో 58 శాతం ఉత్తీర్ణత

ఉండ్రాజవరం: ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ఉండ్రాజవరం జిల్లా పరిషత్ బాలికల జూనియర్ కళాశాలలో 58 శాతం విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్ఎం కె.మాణిక్యాలరావు శనివారం తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి 12 మంది హాజరు కాగా ఏడుగురు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎంపీసీలో 946 మార్కులతో ఎంబీడీ శిరీష ప్రథమస్థానం సాధించిందన్నారు. సీఈసీలో 815 మార్కులతో గున్నేపల్లి తన్విక ప్రథమ స్థానం సాధించిందన్నారు.

చాగల్లు జూనియర్ కళాశాలలో 87.27 శాతం ఉత్తీర్ణత

చాగల్లు: స్థానిక ఎస్‌వీఆర్‌కే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో 87.27 శాతం ఉతీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ పావని తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 83 మంది విద్యార్థులకు 43 మంది పాసయ్యారని, 52 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఎంపీసీలో ఎస్కే షర్మిల 417, బైపీసీలో వీరవల్లి దుర్గాదేవి 398, సీఈసీలో బి.తేజ 456 మార్కులు సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరంలో 87.27 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. 55 మంది పరీక్షలకు హాజరుకాగా 48 మంది ఉత్తీర్ణత పొందినట్టు చెప్పారు. సీనియర్ ఎంపీసీలో వి.పుష్పలక్ష్మి కుమారి 931, బైపీసీలో ఎం.లక్ష్మిమౌనిక 907, సీఈసీలో ఎ.ధనేశ్వరీ 878, హెచ్ఈసీలో జి. హర్షిత నాగలక్ష్మి 773 మార్కులు సాధించారని అన్నారు.

జిల్లా పరిషత్ బాలికల జూనియర్ కళాశాలలో

చాగల్లులో జిల్లా పరిషత్ బాలికల జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో 14 మందికి తొమ్మిదిమంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని కళాశాల ఇన్‌చార్జి వి.మోహన్‌కృష్ణ తెలిపారు. బైపీసీలో కె.లక్ష్మి లవణ్య 905, ఎం.పాసి దుర్గ 876, సీఈసీలో కేతా సుభాషిణీ 873 మార్కులు సాధించారని తెలిపారు. ప్రథమ సంవత్సరంలో ఫలితాల్లో 18 మందికి నలుగురు ఉత్తీర్ణత సాధించినట్టు ఆయన తెలిపారు.

వేగేశ్వరపురం ఇంటర్ కళాశాలలో..

తాళ్లపూడి: వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ గరగ శ్రీనివాస్ తెలిపారు. కళాశాలలో మొత్తం 180 మంది విద్యార్థులకు 91 మంది ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. ప్రథమ సంవత్సరం 106 మందికి 48 మంది ఉత్తీర్ణతతో 45 శాతం సాధించామన్నారు. ద్వితీయ సంవత్సరం 75 మందికి 45 మంది ఉత్తీర్ణతతో 55 శాతం ఫలితాలు సాధించినట్టు తెలిపారు. కళాశాలలో సీనియర్ ఇంటర్ బైపీసీ విద్యార్థి కొడమంచిలి ప్రియాంక 952 మార్కులు సాధించి కళాశాల ప్రథమ స్థానం, కస్సె హరికా కుమారి బైపీసీలో 941 మార్కులు సాధించి ద్వితీయ స్థానం సాధించారన్నారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో యు గీతికా శృతి 425 మార్కులతో ప్రథమస్థానంలో నిలిచినట్టు తెలిపారు. ఎల్ తనూజ ఎంపీసీలో 416 మార్కులు సాధించారని తెలిపారు.

నిడదవోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



ఎండీ రుహిన మహ్మద్

నిడదవోలు : ఇంటర్ పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ బి.గీతాంజలి తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 178 విద్యార్థులకు 97 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 160 మందికి 123 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ ద్వితీయ సంవత్సరంలో 87 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో ఎండీ రుహిన మహమ్మద్ 979, సాధించింది. సీఈసీలో రాపాక భావన 974, బైపీసీలో గంటా హర్షిత 945, హెచ్ఈసీలో గాడ కృపామణి 824 మార్కులు సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో ఎండీ రయనాక్యురేషి 448 మార్కులు సాధించింది. బైపీసీలో ఆకుల జాగృతి 405, సీఆర్‌సీలో కుక్కల వైష్ణవి 414, హెచ్ఈసీలో జి.హేమశ్రీ 437 మార్కులు సాధించారు.

ఇంటర్మీడియెట్‌లో 69 శాతం ఉత్తీర్ణత



యర్నగూడెం జూనియర్ కళాశాల విద్యార్థినులను సత్కరిస్తున్న గ్రామస్తులు, అధ్యాపకులు

దేవరపల్లి: ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో దేవరపల్లి మండలం 69 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారి ఎం.తిరుమలదాస్ తెలిపారు. యర్నగూడెం, దేవరపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గౌరీపట్నంలోని నిర్మల జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఫలితాల్లో 64 శాతం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 69 శాతం మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. మూడు కళాశాలల నుంచి 107 మంది ప్రథమ సంవత్సరం పరీక్షలు రాయగా, 69 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలు 103 మంది రాయగా, 71 మంది ఉత్తీర్ణులయ్యారు. యర్నగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 68.4, ద్వితీయ సంవత్సరం 76, దేవరపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 63.63, ద్వితీయ సంవత్సరం 50, నిర్మల జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 63, ద్వితీయ సంవత్సరం 71 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఆనంద్ ఎడ్యుకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 451 మందికి 325 మంది, ద్వితీయ సంవత్సరం 245 మందికి 183 మంది పాసయ్యారన్నారు. యర్నగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎ.కారుణ్య 971 మార్కులో ప్రథమ, డి.పూర్ణ 959 మార్కులతో ద్వితీయ, ఎస్.కావ్య 942 మార్కులతో తృతీయస్థానం సాధించారని ప్రిన్సిపాల్ ఛత్రపతి శివాజీ తెలిపారు. ఆ విద్యార్థినులను అధ్యాపకులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు.

కోకోకు ధరల స్థిరీకరణ పథకం వర్తింపజేయాలి

నల్లజర్ల: కోకో పంటకు గిట్టుబాటు ధర, కొనుగోలు సమస్యలు పరిష్కరించాలని, ధరల స్థిరీకరణ పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కోకో రైతులు నల్లజర్ల ఉద్యాన శాఖ కార్యాలయం వద్ద శనివారం ఆందోళన నిర్వహించారు. అనంతరం ఉద్యాన శాఖాధికారి ఎం.బబితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, కోకోకు అంతర్జాతీయ మార్కెట్ ధర అందించాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో గింజలకు రూ.1,140 ధర పలికిందన్నారు. ఈ ఏడాది కిలో ధర రూ.700 ఉన్నా సంబంధిత కంపెనీలు రూ.480 నుంచి రూ.550 మాత్రమే చెల్లిస్తున్నాయని, గ్రేడింగ్ విధానం తీసుకువచ్చి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువులు, కౌలు, కూలీల ఖర్చులు పెరిగాయని, ప్రస్తుత ధరల వల్ల రైతులు తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వచ్చిందని చెప్పారు. కోకో గింజలను రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాతూరి సత్యనారాయణ, కేనేరు వెంకటకృష్ణారావు, కొయ్యలమూడి రాజేష్, మేణ్ణి సందీప్, గన్నిన భాస్కరరావు, కాంద్రేగుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కోకో రైతులు



నిడదవోలులో రాస్తారోకో చేస్తున్న కోకో రైతులు

కోకో రైతుల సమస్యలపై రాస్తారోకో

నిడదవోలు రూరల్: కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర కల్పించాలని కోకో రైతులు డిమాండ్ చేశారు. కోరుమామిడి రాష్ట్ర రహదారిపై కోకో రైతులు శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల కాశీ మాట్లాడుతూ కోకో రైతులకు న్యాయం చేయాలని, వెంటనే ప్రభుత్వం స్పందించి కోకో గింజలకు గిట్టుబాటు ధర నిర్ణయించాలన్నారు. ప్రైవేటు కంపెనీల మోసాలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కోకో రైతులు పాల్గొన్నారు.

14 నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

కొవ్వూరు: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏటా నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అగ్నిమాపక శాఖాధికారి ఏవీఎస్ఎన్ఎస్ వేణు తెలిపారు.14న అమరవీరులకు నివాళులర్పించి ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించేందుకు కరపత్రాల పంపిణీ, పోస్టర్స్, బ్రోచర్స్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 15న గ్రామాల్లో, పట్టణంలో ప్రధాన కూడళ్లలో అగ్నిమాపక పరికరాల వినియోగం ప్రదర్శన, నివారణ విన్యాసాలు ప్రయోగాత్మకంగా చేసి చూపించడం ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. 16న బహుళ అంతస్తుల్లో నివాసం ఉంటున్న వారికి ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తామన్నారు. 17న వివిధ సంస్థల్లో విద్యార్థులకు అగ్నిప్రమా దాలపై అవగాహన కల్పిస్తామన్నారు. 18న వివిధ పరిశ్రమలు, గోదాములు, వ్యాపార సంస్థల్లో, 19న ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించడం, 20న వారోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించి ప్రజలకు అగ్ని ప్రమాదాలకు కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు.

సమిశ్రగూడెంలో నేడు మెగా వైద్య శిబిరం

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెంలో అంబేడ్కర్ ప్రాంగణంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 13న ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బిర్దిగంటి గోపి తెలిపారు. రాజమహేంద్రవరం బొల్లినేని హాస్పిటల్స్ వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. ఈ శిబిరాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కొవ్వూరు: అవంతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పట్టణంలో బాపూజీనగర్‌లోని అవంతి హెల్త్ క్లినిక్ అండ్ డయాగ్నోస్టిక్ సెంటర్ వద్ద ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. ఊపిరితిత్తుల సమస్యలు, ఎముకలు, గ్యాస్ట్రో, జనరల్ వైద్యానికి సంబంధించి వైద్య నిపుణులు తమ సేవలందిస్తారన్నారు.

ఇంటర్ పరీక్షా ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు



బి.ఆశశ్రీ (989)



లహరిశ్రీ (986)



శ్రావణిశ్రీ (984)



జోషితశ్రీ (971)



పావనికుమారి (913)

నల్లజర్ల: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో దూబచర్ల ఎలైట్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులతో ఉత్తమ ప్రతిభ చాటినట్టు ప్రిన్సిపాల్ కలగర శ్రీలక్ష్మి తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 91 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు చెప్పారు. సీనియర్ ఎంపీసీలో బి.ఆశశ్రీ 989 మార్కులు సాధించినట్టు చెప్పారు. లహరి 986 మార్కులు, సీనియర్ సీఈసీలో డి.శ్రావణి (984), సీనియర్ బైపీసీ నుంచి జి.జోషిత (971), సీజీఏ నుంచి కె.రవితేజ (929) మార్కులు సాధించి కళాశాలలో ప్రథమంగా నిలిచారన్నారు. జూనియర్ ఎంపీసీలో బి.సుబ్రహ్మణ్యస్వామి 461, బి.వర్షిణి, కె.బాలదుర్గ సత్య 460, బైపీసీలో బి.మేఘన 431 మార్కులు సాధించారన్నారు. పి.బ్యూలా 430, జూనియర్ సీఎస్ఈలో ఈ.శృతి 491, సీఈసీలో యం.దుర్గాభవాని 483 మార్కులు సాధించినట్టు చెప్పారు.ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, కళాశాల డైరక్టర్లు వై.సుదర్శనరావు,జి.సుబ్బారావు అధ్యాపక బృందం అభినందించారు.

అన్నపూర్ణ విద్యార్థుల ప్రతిభ

ఉండ్రాజవరం: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో వేలివెన్ను అన్నపూర్ణ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్ నందిగం భాస్కరరామయ్య శనివారం తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో డి.కృష్ణ మనోహర్ 987, టి.సలోమి 984, వి.నాగవల్లి గంగోత్రి 977 సాధించారని తెలిపారు. సీనియర్ ఇంటర్ సీఈసీలో డి.భావన శ్రీ 961, వి.శృతి 954, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో బి.భారతి, జి.మనస్విని, వైఎల్ఆర్ తనూష 461 మార్కులు, జూనియర్ ఇంటర్ సీఈసీలో పి.లక్ష్మి దుర్గ, పి.విజయ, 472 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని అన్నపూర్ణ జూనియర్ కాలేజ్ సెక్రటరీ నందిగం వెంకట సీతారామయ్య, ప్రిన్సిపాల్ ఏ.రాజేశ్వరి అభినందించారు.

ఎస్ఆర్‌కే విద్యార్థుల ప్రతిభ



బుల్లా శ్వేత (968)



సాయి పల్లవి (972)

నల్లజర్ల: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో నల్లజర్ల ఎస్ఆర్కే, కేయస్ఆర్ సహకార కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్టు చైర్మన్ కంఠమణి వసుంధరదేవి తెలిపారు. సీనియర్ ఎంపీసీలో బుల్లాశ్వేత 968, బైపీసీలో ఆర్.సాయిపల్లవి 972, పలివెల జాహ్నవి జూనియర్ ఇంటర్‌లో 472, చెన్నై భార్గవి 454 మార్కులు సాధించినట్టు చెప్పారు. విద్యార్థులను చైర్మన్ వసుంధదేవి, కరస్పాండెంట్ గన్నమని దొరయ్య అభినందించారు.



వేలివెన్ను అన్నపూర్ణ క్యాంపస్‌లో ఇంటర్ విద్యార్థులను అభినందిస్తున్న డైరక్టర్ భాస్కరరామయ్య, సెక్రటరీ సీతారామయ్య

దాతల సహాయంతో పీహెచ్‌సీలో అభివృద్ధి పనులు



సమిశ్రగూడెం పీహెచ్‌సీ అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న దాత వడ్లమూడి సుదర్శన్‌రాజు, ఆరోగ్య సిబ్బంది

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని దాతల సహాయంతో అభివృద్ధి చేస్తున్నట్టు వైద్యాధికారి ఎం.శివాజీ శనివారం తెలిపారు. తృప్తి ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు వడ్లమూడి రాకడ సుదర్శనరాజు ఆర్థిక సహాయంతో పీహెచ్‌సీని రూ.35 వేలతో మట్టితో మెరక చేయడంతో పాటు కంప్యూటర్, వాటర్ ఫిల్టర్, రోగులు కూర్చునేందుకు సిమెంటు బల్లలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ ఎ.రాజమోహన్, సూపర్‌వైజర్లు వైవీ రమణ, మురళీ, సిబ్బంది పాల్గొన్నారు.

గజ్జరం రోడ్డులో పచ్చని చెట్లకు నిప్పు

తాళ్లపూడి: పాత సామాన్ల షాపుల్లో పేరుకుపోయిన చెత్తను సమీపంలోని చెట్లకు వద్ద వేసి తరచూ నిప్పు పెడుతున్నారు. మండలంలోని పైడిమెట్ట నుంచి గజ్జరం ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన చింత చెట్లు ఏళ్ల తరబడి ఉన్నాయి. పాత సామాన్ల షాపు నిర్వాహకులు ప్లాస్టిక్ సామగ్రి, ఇతర చెత్తను రాత్రి సమయాల్లో చింత చెట్ల వద్దకు తెచ్చి తరచూ నిప్పు పెడుతున్నారు. దీంతో భారీ వృక్షాలు ఎండిపోతున్నాయి. శుక్రవారం రాత్రి చింత చెట్టుకు మంటలు వ్యాపించాయి. రోడ్డు పక్కనే ఉన్న పాత ఇనుప సామాన్ల షాపుల్లో వచ్చిన చెత్తకు నిప్పు పెట్టడంతో చింత చెట్లకు మంటలు వ్యాపించాయి. దీంతో సమాచారం తెలిసిన గజ్జరం సర్పంచ్ గండి రాంబాబు అధికారులకు సమాచారం ఇచ్చారు. చెత్తకు నిప్పు పెట్టడంతో అనేక అనర్థాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. దీనిపై అనేక పర్యాయాలు మండల పరిషత్ సమావేశాల్లో ప్రస్తావించామని అన్నారు. కొవ్వూరు ఫైర్ ఆఫీసర్ వేణు, సిబ్బంది రవి తదితరులు వచ్చి చెట్టుకు వ్యాపించిన మంటలను అదుపు చేసారు. శనివారం ఉదయం కూడా మంటలు పూర్తిగా చల్లారక పోవడంతో చెట్టు పూర్తిగా కాలిపోయింది. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు దృష్టి సారించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



గజ్జరం రోడ్డులో చింత చెట్టుకు నిప్పు అంటుకున్న దృశ్యం

పచ్చిరొట్ట పంటలతో భూసారం పెంచుకోవాలి



లక్ష్మీపురంలో పచ్చిరొట్ట ఎరువుల సాగుపై అవగాహన ర్యాలీ

దేవరపల్లి: భూముల్లో పచ్చిరొట్ట ఎరువుల పంటలను సాగు చేసి భూముల సారాన్ని పెంచుకోవాలని ప్రకృతి వ్యవసాయ విభాగం డివిజన్ ట్రైనర్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. పచ్చిరొట్ట ఎరువుల పంటల సాగుపై మండలంలోని లక్ష్మీపురంలో శనివారం రైతులకు అవగాహన ర్యాలి నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువుల వినియోగం వల్ల భూమి సారవంతంగా ఉండి భూమికి బలం వస్తుందన్నారు. రైతులు పచ్చిరొట్ట పంటలను వేసి 45 రోజుల్లో భూమిలో కలియదున్ని ప్రధాన పంట వేసుకుంటే అధిక దిగుబడి వస్తుందన్నారు. ఖరీఫ్ 2025 రైతుల ఆహ్వాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. నవధాన్యాలను పచ్చిరొట్ట ఎరువువగా సాగు చేయాలని ఆయన రైతులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దోనెల్లి ధనలక్ష్మి, నున్న చిన్ని, బొల్లిన బాబి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.